క్లుప్తంగా

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్

షాబాద్: మహాత్మా బసవేశ్వరుని విగ్రహ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించనున్నట్లు హోప్ ఫౌండేషన్ ఆఫ్ హైదరాబాద్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మహాత్మా బసవేశ్వరుని విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వీరశైవ లింగ బలిజసమాజం సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 12వ తేదీన శ్రీ మహాత్మా బసవేశ్వరుని విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం షాబాద్‌లో నిర్వహిస్తామన్నారు. వీరశైవ సమాజం సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమలో వీరశైవ లింగ బలిజ సమాజం సభ్యులు లింగప్ప, బస్వరాజు, పర్వవేది, మల్లేష్, వీరేష్, మల్లికార్జున్, నవీన్, శేఖర్, రాజేష్, ప్రదీప్, గణేష్, వినీత్ తదితరులున్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: మండలంలోని ఎన్కేపల్లిలో గ్రామస్తులు గ్రామ దేవతలకు పూజలు, బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ పూజల్లో కాంగ్రెస్ నాయకులు సున్నపు వసంతం, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టండి: సీపీఐ

మంచాల: మండలంలోని వివిధ గ్రామాల్లో పాడైపోయిన రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ నేత శ్రీశైలంయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మంచాలలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆగాపల్లి-జాపాల, మంచాల-జాపాల, ఆరుట్ల-బండలేమూర్ రోడ్లపై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వం రోడ్ల బాగుకు అధికంగా నిధులు కేటాయించినట్లు పేర్కొంటుంది. గ్రామాల్లో మాత్రం రోడ్లు ఏళ్లు గడిచినా బాగుచేసే నాథుడులేడని వాపోయారు. తక్షణమే రోడ్లను బాగుచేయాలని కోరారు.

వైభవంగా బీరప్ప బోనాలు

యాచారం: మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం బీరప్ప బోనాలు వైభవంగా జరిగాయి. కుర్మ కులస్తులు దేవతామూర్తులకు బోనాలతో నైవేద్యం సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఐ లింగయ్య బందోబస్తును పర్యవేక్షించారు.

నేడు దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష

ఆమనగల్లు: మాడ్గుల మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాఘవులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉత్సవాల నిర్వహణపై అవగాహన, కార్యాచరణపై నిర్వహించే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరిద్దాం

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించడానికి చేపట్టిన మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి కోరారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం మండల, మున్సిపల్ బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచారి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ 9 ఏళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రజల కోసం అమలుచేస్తున్న పథకాల గురించి బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు. మళ్లీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కూడా అధికారమే లక్ష్యంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు నిర్వహించే మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ ఎంపీపీ వెంకటయ్య, బీజేపీ నాయకులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు చేయూత



గొడుగులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: రోజంతా ఎండల్లో వ్యాపారం చేసుకునే వారికి సహాయం చేయాలని ఆలోచనతో ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి తనవంతుగా వారికి గొడుగులు అందిస్తూ అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం ఎంపీ సహకారంతో చిరువ్యాపారులకు గొడుగులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి ఎండలు తీవ్రత దృష్ట్యా రంజిత్‌రెడ్డి చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీకి ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఎండల నుంచి వారికి ఈ గొడుగులతో కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. ఎంపీ దాతృత్వం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎం. కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కె. శివప్రసాద్, పి.ప్రభాకర్, నరేందర్, రవీరందర్, చిరువ్యాపారులు ఉన్నారు.

సీపీఐ ‘ప్రజాగర్జన’ కు తరలిరండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొందుర్గు: కొత్తగూడెంలో జూన్ 4వ తేదీన నిర్వహించే సీపీఐ ప్రజా గర్జన ముగింపు సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య సూచించారు. కొందుర్గులో ఆదివారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు ఇంటింటికి సీపీఐ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, గ్రామాల్లో జీపుయాత్ర తదితర కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సీపీఐ ప్రజాగర్జన నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సభకు అన్ని గ్రామాల నుంచి కర్షక, కార్మిక సోదరులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, నర్సింలు, దాసు, సురేష్, సందమ్మ, పద్మమ్మ, సాయన్న పాల్గొన్నారు.

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

సర్పంచ్ ప్రభాకర్



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్, తదితరులు

కొత్తూరు: క్రీడల్లో రాణిస్తే యువత, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్‌బీపల్లి సర్పంచ్ అంబటి ప్రభాకర్ అన్నారు. గ్రామంలో ఆదివారం నిర్వహించిన పీపీఎల్ సీజన్-5 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన పలువురు నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ... క్రీడాకారులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో మరింత నైపుణ్యం పెంచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. భవిష్యత్తులో పోలీసు, ఆర్మీతో పాటు పలు రంగాల్లో సులువుగా ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎమ్మె బాల్‌రాజు, నాయకులు సుధాకర్‌రెడ్డి, రాజు, టోర్నమెంట్ స్పాన్సర్స్ లింగారం సురేష్‌గౌడ్, దేవేందర్, కోటప్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేద్దాం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కొందుర్గు: రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేద్దామని బీజేపీ నేత డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు చేరేలా చూడాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శివారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అశోక్, శ్రీశైలం, శంకర్, సత్యనారాయణ, ప్రభులింగం శ్రీశైలం, మల్లేష్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భారీగా విరాళాలు



కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న సత్యయ్య కుటుంబ సభ్యులు

శంకర్‌పల్లి: పట్టణ కేంద్రంలోని అయ్యప్ప దేవాలయం నిర్మాణానికి ఆదివారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు భారీగా విరాళాలు అందజేశారు. కమిటీ సభ్యుల వివరాల ప్రకారం.. మండలంలోని మాసానిగూడ మాజీ సర్పంచ్ సంజి సతయ్య రూ. 2లక్షల 11వేలు, గోపులారం గ్రామ సర్పంచ్ పాడువు శ్రీనివాస్ రూ. 1లక్ష, 11వేలు అందించారు. బుల్కాపురం గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి రూ. 52వేలు, శంకర్‌పల్లి పట్టణ కేంద్రానికి చెందిన ఎం. రాజశేఖర్ 2కిలోల, 2మాసాల వెండి అందజేశారు. కె. రవి కుమార్ రెండు తులాల, రెండు మాసాల బంగారం, కిలో వెండి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆత్మలింగం, సభ్యులు శ్రీనివాస్, మోహన్, ప్రవీణ్, జంగయ్య, పాండురంగారెడ్డి, శ్రీనివాస్, శేఖర్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

శంకర్‌పల్లి: మండలంలోని అయ్యప్ప దేవస్థానంలో అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం నుంచి జూన్ 5వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటణలో పేర్కొన్నారు. ఆదివారం దేవాలయంలో గణపతి పూజతో ప్రారంభించడం జరిగిందన్నారు. సోమవారం ఉదయం 7గంటలకు శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని హనుమాన్ దేవాలయం నుంచి అయ్యప్ప దేవస్థానం వరకు ప్రతిష్ఠ దేవతా మూర్తుల విగ్రహ ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రచయిత గంగిరెడ్డికి సన్మానం



గంగిరెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: వంగూరి వాచకం పుస్తక రచయిత విశ్రాంత ఉపాధ్యాయుడు వంగూరి గంగిరెడ్డిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆయను శాలువాతో ఘనంగా సన్మానించారు. సమాజానికి ఎంతో ఉపయోగపడే విధంగా ఉండే రచనలు, కవిత్వాలు అందరిని ఆలోచింపజేస్తాయని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

● మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి

షాద్‌నగర్: తెలుగు జాతి గౌరవాన్ని పెంచిన మహానేత ఎన్టీఆర్ అని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవని మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాలను షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ చౌరస్తాలో టీడీపీ నేతలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌తోనే గ్రామాల్లో రాజకీయ చైతన్యం వచ్చిందన్నారు. బడుగు బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. మహనీయుడి ఆశయాల సాధన కోసం అందరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంధం ఆనంద్, రమేష్, నర్సింలు, అంజయ్య, అనంతయ్య, అంజయ్య, కుమార్, కృష్ణయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సింలు, రమేష్, శంకరయ్య, భూపతిరెడ్డి, రామకృష్ణ, శంకరయ్య, భూపతిరెడ్డి, బాబు నాయక్, కుదుముల యాదయ్య పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు గుర్తింపు తెచ్చిన మహనీయుడు

మొయినాబాద్: బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా గుర్తింపు తెచ్చిన మహనీయుడు స్వర్గీయ ఎన్టీఆర్ అని టీడీపీ మండల కన్వీనర్ ఎల్గని యాదయ్య అన్నారు. ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌తోనే రాజకీయ మార్పు వచ్చిందని, ఆయన స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రవీణ్, రాజుగౌడ్, మూర్తి, షరీఫ్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

రక్తదానం ప్రాణదానంతో సమానం



షాబాద్: నాగర్‌గూడలో రక్తదాన చేస్తున్న యువకులు

షాబాద్: రక్తదానం ప్రాణదానంతో సమానమని షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నాగర్‌గూడ శ్రీ చైతన్య పాఠశాల ప్రాంగణంలో వీర సావర్కర్ జయంతి సందర్భంగా గాంధీ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 80మందికి పైగా యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. రక్తదాన శిబిరాలు ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి రక్తదానం చేయడానికి ఉపయోగపడుతాయన్నారు. ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి యువకుడు రక్తదానం చేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ రక్తం పోవడం వల్ల కొంతమంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అలాంటి వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేష్, మాజీ ఎంపీటీసీ పాండు, మహేందర్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, అశోక్, రఘు, విజయ్, నరేష్, కృష్ణ, కుమార్ చెన్నారెడ్డి తదితరులున్నారు.

హిందూ సమాజం కోసం కృషి

చేవెళ్ల: మాతృభూమికోసం మరణం కూడా జననం లాంటిదే అని బ్రిటిష్ అధికారాన్ని ధిక్కరించి స్వాతంత్ర్య పోరాటం చేసిన విప్లవ వీరుడు, సంఘ సంస్కర్త వినాయక్ దామోదర్ సావర్కర్ అని బీజేపీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశభక్తి ప్రతి భారతీయుడి కర్తవ్యమన్నారు. ఆ మహనీయుడు చూపించిన మార్గాలు అందరికి ఆదర్శమని తెలిపారు. హిందువులను చైతన్యం చేసి హిందూ ధర్మాన్ని కాపాడేందుకు ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు బి. చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎం. మధుకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, ఓబీసీ నాయకులు సీహెచ్ శ్రీనివాస్, నాయకులు నవీన్‌రెడ్డి, రాము, బాల్‌రాజ్ ఉన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరిక

ఎంపీపీ రవీందర్ యాదవ్



పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పతున్న రవీందర్ యాదవ్

కేశంపేట: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్ అన్నారు. మండలంలోని కొనాయపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం రవీందర్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎంపీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మిషన్ కాకతీయ పథకంతో చెరువులను బాగు చేశారని తెలిపారు. దీంతో ప్రతి చెరువులో నీరు నిల్వ ఉందన్నారు. భూగర్భ జలాల పెరిగి వ్యవసాయానికి అవసరమైన నీరు పుష్కలంగా ఉందని చెప్పారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచి నీటిని సరఫరా చేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలని వినతి



ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన గొల్లగూడ గ్రామస్తులు

చేవెళ్ల: కొత్తగా ఏర్పడిన తమ గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకారం అందించాలని గొల్లగూడ గ్రామస్తులు ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డిని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయనను కలిసి గ్రామంలోని సమస్యలను వివరించారు. దీంతో ఎంపీ రంజిత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి తప్పకుండా గొల్లగూడ గ్రామాభివృద్ధికి సహకారం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో వార్డు సభ్యులు మనోహర్‌గౌడ్, మురారి, కె.నర్సింలు, జంగయ్య, సత్తయ్యగౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ముకుందంగౌడ్, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు మన్మోహన్‌గౌడ్, గ్రామ యువకులు, తదితరులు ఉన్నారు.

ప్రజాసేవకు ముందుంటా..

● ఎంపీటీసీ ప్రవళిక



ఆటోను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ ప్రవళిక

శంకర్‌పల్లి: ప్రజాసేవ చేసేందుకు ఎళ్లప్పుడు ముందుంటానని ఎంపీటీసీ బొల్లారం ప్రవళిక పేర్కొన్నారు. ఆదివారం ఆమె సొంత డబ్బులతో గ్రామస్తుల ప్రయాణ సౌకర్యార్థం ఉచిత ఆటో సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రొద్దటూరు గ్రామం నుంచి ప్రొద్దటూరు స్టేజి వరకు ఉచిత ఆటో సేవలు కల్పించడం జరిగిందన్నారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు స్టేజీ వరకు వెళ్లి బస్సు ఎక్కేందుకు ఎంతో సులువుగా ఉంటుందన్నారు. గతంలో తమ కుటుంబ సభ్యులు సర్పంచ్‌గా ఉన్న సమయంలో సొంత డబ్బులతో మంచి నీటి ట్యాంకర్, సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏనుగు నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ మల్లారెడ్డి, జిల్లా మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బొల్లారం వెంకట్‌రెడ్డి, పంచాయతీ కో-ఆప్షన్ మెంబర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ బండ నర్సింహా, మాజీ ఏఎంసీ చైర్మన్ మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంలో సబ్బండవర్గాలకు మోసం



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు శంకర్

పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్

కేశంపేట: పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సబ్బండ వర్గాలు మోసపోయారని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని బైర్కాన్‌పల్లిలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియమాకాల కోసం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం సాగితే సోనియాగాంధీ సబ్బండ వర్గాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రాష్ట్రం ఇచ్చిందన్నారు. జూన్ 2న గ్రామాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి సోనియగాంధీకి కృతజ్ఞతలు తెలియజేస్తామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ నిలబెట్టుకోలేదని ఆయన ఆరోపించారు. అలాగే, బైర్కాన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త వెంకయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో మంజూరైన బీమా చెక్కును బాధితుడి భార్య భారతమ్మకు శంకర్ అందజేశారు. అదే విధంగా కొత్తపేట శివారులోని మూద్దాద్‌పూర్‌లో బోరు మోటార్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యదయ్యాయాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, బాబర్‌ఖాన్, కుమార్‌యాదవ్, గణేశ్, మాణేమ్మ, రూప్లానాయక్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నందిగామ మండలంలో ఆదివారం ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు అరవింద్‌చారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భం గా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. అలాగే, బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీలైన దళితులకు మూడెకరాల భూమి, అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, కేజీ టూ పీజీ ఉచిత విద్యతో పాటు పలు అంశాలను ప్రజల సమక్షంలో చర్చకు తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌గౌడ్, మోహన్‌సింగ్, సత్యంయాదవ్, కృష్ణమోహన్, రాజు, ప్రభాకర్‌చారి, శ్రీనివాస్, ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాబాద్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం షాబాద్ స్టార్ గార్డెన్‌లో కలుసుకొని తీపి జ్ఞాపకాలు పంచుకున్నారు. చిన్న తనంలో ఏర్పడిన స్నేహబంధం ఎప్పటికీ మరిచిపోనిది. విడదీయరానిదని గుర్తు చేసుకున్నారు. వ్యాపార, ఉద్యోగ, కుటుంబాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారు ఒక్కచోటికి రావడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ రోజు ఎంతో సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు సందడిగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దశరథ, రమేష్, విజయలక్ష్మి, వేణుగోపాల్, పూర్వ విద్యార్థులు యాదగిరి, శ్రీనివాస్, నరేష్, రాజేందర్‌రెడ్డి, కృష్ణ, మహేందర్‌చారి, శ్రీనివాస్‌చారి, రాజు, మహేందర్, మల్లేష్, సరిత, రామదేవి, పావని, అశ్వని, సంధ్యా, సరిత, సువర్ణ, తదితరులున్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు